జాతీయ తెలుగు దినపత్రిక
# ప్రజాజ్యోతి
ప్రతి అక్షరం ప్రజల కోసం
మహబూబ్‌నగర్
నాగర్ కర్నూల్, వనపర్తి
జోగులాంబ గద్వాల
నారాయణపేట
04 శుక్రవారం సెప్టెంబర్ , 2026 పేజీలు:10









06లో

ఢిల్లీ వేదికగా తెలంగాణ కాంగ్రెస్ కీలక మంతనాలు!

ఖర్గేతో సీఎం రేవంత్‌రెడ్డి,మంత్రులు, సంపత్‌కుమార్ భేటీ

# 420 హామీలకు సమాధానం చెప్పండి..

# కాంగ్రెస్ పాలనపై గులాబీ గర్జన!




- చిన్నచింత కుంటలో రైతులతో కలిసి బీఆర్ఎస్ భారీ నిరసన ర్యాలీ..
- మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో కదం తొక్కిన శ్రేణులు


**మహబూబ్ నగర్, సెప్టెంబర్ 3 ( ప్రజా జ్యోతి బ్యూరో ):** కాంగ్రెస్ ప్రభుత్వం వెయ్యి రోజుల పాలనలో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైందని ఆరోపిస్తూ దేవరకద్ర నియోజకవర్గ బీఆర్ఎస్ శ్రేణులు కదం తొక్కాయి. ఆరు గ్యారెంటీలు, 420 హామీల పేరుతో ప్రజలను మభ్యపెట్టి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం వాటి అమలులో విఫలమైందని నిరసిస్తూ గురువారం చిన్నచింతకుంట మండల కేంద్రంలో రైతులతో కలిసి భారీ నిరసన ర్యాలీ నిర్వహించారు. దేవరకద్ర మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, రైతులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను గుర్తుచేస్తూ ప్లకార్డులు ప్రదర్శిస్తూ, వాటిని వెంటనే అమలు చేయాలని నినాదాలు చేశారు.

**420 హామీల ఫ్లెక్సీ ప్రదర్శన హైలైట్ :**

కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన 420 హామీలు ప్రజలకు స్పష్టంగా కనిపించేలా ఏర్పాటు చేసిన భారీ ఫ్లెక్సీ ప్రదర్శన నిరసనలో ప్రధాన ఆకర్షణగా నిలిచింది. హామీలను అమలు చేయకుండా ప్రజలను మోసం చేస్తున్నారని బీఆర్ఎస్ శ్రేణులు ఆరోపించాయి. రైతులు, ప్రజల సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం విఫలమైందని విమర్శించాయి.

**"ఆంక్షలతో అడ్డుకోలేరు":**

నిరసన ర్యాలీని అడ్డుకునేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం ప్రయత్నాలు చేసిందని బీఆర్ఎస్ నాయకులు ఆరోపించారు. అయితే ఎన్ని ఆంక్షలు, అడ్డంకులు విధించినా బీఆర్ఎస్ శ్రేణులు వెనక్కి తగ్గబోవని స్పష్టం చేశారు. ప్రజా సమస్యలపై పోరాటం కొనసాగిస్తామని తెలిపారు. చిన్నచింతకుంటలో నిర్వహించిన ర్యాలీ ద్వారా కాంగ్రెస్ ప్రభుత్వ పాలనా వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లే ప్రయత్నం చేశారు. భారీగా తరలివచ్చిన బీఆర్ఎస్ శ్రేణులతో మండల కేంద్రం గులాబీమయంగా మారింది. కార్యకర్తల్లో నూతనోత్సాహం నెలకొనగా, మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి ర్యాలీకి నాయకత్వం వహించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేసి ప్రజలకు సమాధానం చెప్పే వరకు తమ పోరాటం ఆగదని బీఆర్ఎస్ శ్రేణులు స్పష్టం చేశాయి.




# కాంగ్రెస్ పాలనలో రైతుకు కష్టాలే.. కేసీఆర్ హయాంలో వ్యవసాయం పండుగ

### - యూరియా కోసం క్యూలు.. - కరెంట్ లేక పంటలు ఎండుతున్నాయి : మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్

**మహబూబ్‌నగర్, సెప్టెంబర్ 3 ( ప్రజా జ్యోతి బ్యూరో ):**

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత వ్యవసాయ రంగం తీవ్ర సంక్షోభంలోకి వెళ్లిందని, రైతులను అన్ని విధాలుగా ఇబ్బందులకు గురిచేస్తోందని మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ ఆరోపించారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో వ్యవసాయం పండుగలా సాగితే, కాంగ్రెస్ పాలనలో రైతులు యూరియా కోసం క్యూలలో నిలబడాల్సిన దుస్థితి ఏర్పడిందని విమర్శించారు.
మహబూబ్‌నగర్ మండల పరిధిలోని కోడూరు చౌరస్తాలో నిర్వహించిన రైతు సదస్సు, ధర్నాలో ఆయన పాల్గొని మాట్లాడారు. కేసీఆర్ హయాంలో సాగు విస్తీర్ణం పెరిగిందని, భూముల విలువలు పెరిగాయని, చెక్‌డ్యాంల నిర్మాణం, చెరువుల నింపడం వంటి చర్యలతో వ్యవసాయానికి ఊతమిచ్చామని తెలిపారు. అప్పట్లో యూరియా కొరత లేకుండా రైతులకు అందుబాటులో ఉంచామని, పంటలకు అవసరమైన విద్యుత్‌ను సరఫరా చేశామని అన్నారు. ప్రస్తుతం యూరియా కోసం రైతులు పొలాలను వదిలి విక్రయ కేంద్రాల వద్ద గంటల తరబడి క్యూలలో నిలబడుతున్నారని, విద్యుత్ సరఫరా సక్రమంగా లేక పంటలు ఎండిపోతున్నాయని ఆరోపించారు.





**"హామీలతో రైతులను మోసం చేశారు"**

ఎన్నికల సమయంలో రూ.2 లక్షల రుణమాఫీ చేస్తామని హామీ ఇచ్చి కాంగ్రెస్ ప్రభుత్వం మాట తప్పిందని శ్రీనివాస్‌గౌడ్ విమర్శించారు. కౌలు రైతులు, రైతు కూలీలకు ఆర్థిక సహాయం చేస్తామని చెప్పి మోసం చేసిందని ఆరోపించారు. రైతులు పండించిన పంటలను ప్రభుత్వం సకాలంలో కొనుగోలు చేయకపోవడంతో తక్కువ ధరలకు ప్రైవేట్ వ్యాపారులకు విక్రయించాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. రైతుబంధు అందడం లేదని, రైతుబీమా ప్రీమియం చెల్లించకపోవడంతో రైతు కుటుంబాలకు భరోసా లేకుండా పోయిందని ఆరోపించారు. కాంగ్రెస్ పాలనలో వ్యవసాయ రంగం పూర్తిగా దెబ్బతిన్నదని అన్నారు.

**"ఏడాదిలో సాగునీరు పొలాల్లోకి తెస్తాం":**

కేసీఆర్ హయాంలో కర్వేన, ఉదండాపూర్ ప్రాజెక్టులు పూర్తయ్యాయని, కర్వేన నుంచి మహబూబ్‌నగర్ మండలానికి, ఉదండాపూర్ నుంచి హన్వాడ ప్రాంతానికి నీరు వచ్చే పరిస్థితి కల్పించామని శ్రీనివాస్‌గౌడ్ తెలిపారు. అయితే కాంగ్రెస్ ప్రభుత్వం ప్రాజెక్టులు, అభివృద్ధి పనులను నిర్లక్ష్యం చేస్తోందని విమర్శించారు. మన్యంకొండ రోప్‌వే సహా పలు అభివృద్ధి కార్యక్రమాలను నిలిపివేశారని ఆరోపించారు. బీఆర్ఎస్ తిరిగి అధికారంలోకి వస్తే ఏడాదిలోపు సాగునీటిని పొలాల్లోకి తీసుకువచ్చేలా చర్యలు చేపడతామని శ్రీనివాస్‌గౌడ్ హామీ ఇచ్చారు. గ్రామాల్లోకి వెళ్లి కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలు, వాటి అమలులో వైఫల్యాలను ప్రజలకు వివరించాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ రాజేశ్వర్‌గౌడ్, మున్సిపల్ మాజీ చైర్మన్ నర్సింహులు, ముడా మాజీ చైర్మన్ గంజి వెంకన్న, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ఆంజనేయులు, మాజీ వైస్ చైర్మన్ గిరిధర్‌రెడ్డి, రైతు కమిటీ మాజీ చైర్మన్ మల్లు నర్సింహారెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు మల్లు దేవేందర్‌రెడ్డి, మాజీ ఎంపీపీ సుధాశ్రీ, పీఏసీఎస్ చైర్మన్ రాజేశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# నర్సరీలకు తప్పనిసరిగా రిజిస్ట్రేషన్,లైసెన్స్ ఉండాలి

## జిల్లా ఉద్యాన అధికారి జి.రాజ్‌కుమార్

**గద్వాల,సెప్టెంబర్ 3(ప్రజా జ్యోతి ప్రతినిధి):**

జిల్లాలోని వివిధ మండలాల్లో సుమారు 30 కూరగాయల నర్సరీలు ఉన్నాయని,ప్రతి నర్సరీ నిర్వాహకుడు తప్పనిసరిగా రిజిస్ట్రేషన్ చేసుకొని లైసెన్స్ పొందాలని జిల్లా ఉద్యాన శాఖ అధికారి జి.రాజ్‌కుమార్ సూచించారు.గురువారం గద్వాల మండల కేంద్రంలోని పలు కూరగాయల నర్సరీలను ఆయన పరిశీలించారు.నర్సరీల నిర్వహణ,మొక్కల నాణ్యత,రిజిస్ట్రేషన్,లైసెన్స్ తదితర అంశాలను తనిఖీ చేసి నిర్వాహకులకు పలు సూచనలు చేశారు.నిబంధనలు పాటించకుండా నర్సరీలను నిర్వహిస్తే ఉద్యాన నర్సరీల రిజిస్ట్రేషన్,క్రమబద్ధీకరణ చట్టం2010 (యాక్ట్ 13ఆఫ్ 2010),తెలంగాణ ఉద్యాన నర్సరీల రిజిస్ట్రేషన్ రూల్స్2017 ప్రకారం చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.కొన్ని నర్సరీలు ప్రభుత్వ అనుమతి,రిజిస్ట్రేషన్ లేకుండా నాసిరకం నారు,మొక్కలను విక్రయిస్తున్నట్లు,రైతులకు బిల్లులు ఇవ్వడం లేదని తమ దృష్టికి వచ్చిందన్నారు. ఇలాంటి నర్సరీలపై చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని తెలిపారు.రైతులకు నాణ్యమైన,ఆరోగ్యకరమైన,చీడపీడలు లేని కూరగాయల నారు,పండ్లు,పూల మొక్కలను అందించడమే నర్సరీ చట్టం ప్రధాన ఉద్దేశమని రాజ్‌కుమార్ తెలిపారు. కూరగాయల నారును సంప్రదాయ పద్ధతుల్లో కాకుండా షేడ్‌నెట్ నర్సరీలు,ప్రోట్రేలలో శాస్త్రీయ పద్ధతుల్లో ఉత్పత్తి చేసి రైతులకు అందించాలని సూచించారు.మొక్కల నాణ్యత,పరిమాణం,ప్రమాణాలకు అనుగుణంగా ధర నిర్ణయించడం,నాణ్యమైన తల్లి మొక్కలను నిర్వహించడం కూడా చట్టం ముఖ్య ఉద్దేశాల్లో భాగమని వివరించారు.

### రిజిస్ట్రేషన్‌కు అవసరమైన పత్రాలు

నర్సరీ రిజిస్ట్రేషన్ కోసం నర్సరీ పూర్తి చిరునామా,దరఖాస్తుదారుడి ఫొటో,భూమి పత్రాలు/పట్టాదారు పాస్‌బుక్/లీజ్ అగ్రిమెంట్,ప్రభుత్వ గుర్తింపు పొందిన సర్వేయర్ రూపొందించిన లేఅవుట్ మ్యాప్,నర్సరీలోని వసతుల వివరాలు,భూసార,నీటి నాణ్యత పరీక్ష నివేదికలు,గత మూడు సంవత్సరాల మొక్కల ఉత్పత్తి వివరాలు, నర్సరీ డిజిటల్ ఫొటోలు,రిజిస్ట్రేషన్ రుసుము చెల్లించిన రశీదు తదితర పత్రాలను సమర్పించాల్సి ఉంటుందని తెలిపారు.రైతులు మొక్కలు,నారు కొనుగోలు చేసే సమయంలో రిజిస్ట్రేషన్,లైసెన్స్ కలిగిన నర్సరీల నుంచే కొనుగోలు చేసి తప్పనిసరిగా బిల్లు తీసుకోవాలని జిల్లా ఉద్యాన అధికారి సూచించారు.ఈ కార్యక్రమంలో గద్వాల ఉద్యాన అధికారి ఎం.రాజశేఖర్,నర్సరీ నిర్వాహకులు,రైతులు తదితరులు పాల్గొన్నారు.



# ఈవీఎం గోడౌన్‌ను పరిశీలించిన జిల్లా కలెక్టర్

**గద్వాల,సెప్టెంబర్ 3(ప్రజా జ్యోతి ప్రతినిధి):**

జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ సమీపంలో ఉన్న ఈవీఎం గోడౌన్‌ను ఈవీఎంల నెలవారీ సాధారణ తనిఖీల్లో భాగంగా గురువారం జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ పరిశీలించారు.ఈ సందర్భంగా వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలిసి గోడౌన్‌లోని ఈవీఎంలు,బ్యాలెట్ యూనిట్ల భద్రతా ఏర్పాట్లను తనిఖీ చేశారు.ఈవీఎంలు,బ్యాలెట్ యూనిట్ల భద్రత విషయంలో ఎలాంటి లోపాలకు తావులేకుండా అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని సంబంధిత అధికారులు,సిబ్బందిని కలెక్టర్ ఆదేశించారు.గోడౌన్ భద్రతా ప్రమాణాలను నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు.ఈ తనిఖీలో ఎన్నికల విభాగం పర్యవేక్షకురాలు మంజులతో పాటు వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు,ఎన్నికల విభాగం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.





# కొండా సురేఖను మంత్రి పదవి నుంచి తొలగించడం హేయం

## - బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చవ్వ మోహన్‌కుమార్ యాదవ్



**వనపర్తి, సెప్టెంబర్ 3 (ప్రజాజ్యోతి):**

కొండా సురేఖను రాష్ట్ర మంత్రి పదవి నుంచి తొలగించడం హేయమైన చర్య అని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చవ్వ మోహన్‌కుమార్ యాదవ్ అన్నారు. గురువారం వనపర్తిలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బీసీ పద్మశాలి సామాజికవర్గానికి చెందిన మహిళా నాయకురాలైన కొండా సురేఖ 1994లో ఎంపీపీగా రాజకీయ ప్రస్థానం ప్రారంభించి అంచెలంచెలుగా ఎదిగి ఐదుసార్లు ఎమ్మెల్యేగా గెలుపొందారని మోహన్‌కుమార్ యాదవ్ తెలిపారు. రెండు పర్యాయాలు మంత్రిగా పనిచేసిన ఆమెను మంత్రివర్గం నుంచి తొలగించడం బీసీలు, మహిళల పట్ల కాంగ్రెస్ ప్రభుత్వ వైఖరికి నిదర్శనమని ఆరోపించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అహంకార ధోరణితోనే కొండా సురేఖను మంత్రి పదవి నుంచి తొలగించారని ఆయన విమర్శించారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ వర్గాల అభివృద్ధికి కృషి చేస్తామని చెప్పి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం అందుకు విరుద్ధంగా వ్యవహరిస్తోందని ఆరోపించారు. నామినేటెడ్ పదవుల్లోనూ బీసీలకు తగిన ప్రాధాన్యం ఇవ్వడం లేదన్నారు. కొండా సురేఖను మంత్రివర్గం నుంచి తొలగించిన వ్యవహారాన్ని బీసీ సంక్షేమ సంఘం తీవ్రంగా పరిగణిస్తోందని తెలిపారు. మహిళా నాయకురాలిని అవమానించేలా వ్యవహరించడం సరికాదని, ఈ విషయంలో కాంగ్రెస్ అధిష్ఠానం పునరాలోచించాలని డిమాండ్ చేశారు. బీసీ, బహుజన వర్గాలకు జరుగుతున్న అన్యాయాన్ని ప్రజల్లోకి తీసుకెళ్తామని, రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ తగిన మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని హెచ్చరించారు. ఇదిలా ఉండగా, ఓటుకు నోటు కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి ఆ పదవిలో కొనసాగేందుకు నైతిక హక్కు లేదని మోహన్‌కుమార్ యాదవ్ ఆరోపించారు. ఈ అంశంలో బీజేపీ జోక్యం చేసుకుని ముఖ్యమంత్రిపై చర్యలు తీసుకునేలా చూడాలని ఆయన డిమాండ్ చేశారు.

# పీఎం శ్రీ జెడ్పీహెచ్ఎస్ మల్దకల్‌లో మొక్కలు నాటిన డీఆర్‌డీవో

## - వీబీజీ రామ్ జీ కార్యక్రమం పర్యవేక్షణలో భాగంగా పాఠశాల సందర్శన





**మల్దకల్,సెప్టెంబర్ 3(ప్రజా జ్యోతి):**
వికసిత్ భారత్‌గ్యారంటీ ఫర్ రోజ్‌గార్ అండ్ ఆజీవికా మిషన్ (గ్రామీణ్) (వి బిజీ రామ్ జీ) కార్యక్రమం పర్యవేక్షణలో భాగంగా జోగులాంబ గద్వాల జిల్లా డీఆర్‌డీవో ముషాయిదా బేగం గురువారం మల్దకల్ గ్రామంలోని పీఎం శ్రీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను సందర్శించారు.ఈ సందర్భంగా పాఠశాల ఆవరణలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహించారు.పర్యావరణ పరిరక్షణ,పచ్చదనం పెంపొందించడం,విద్యార్థుల్లో మొక్కల సంరక్షణపై అవగాహన కల్పించడం వంటి అంశాల ప్రాధాన్యతను ఆమె వివరించారు.పాఠశాల ఆవరణను పరిశుభ్రంగా,పచ్చదనంతో ఉంచేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు.నాటిన మొక్కలను సంరక్షించే బాధ్యతను విద్యార్థులు,పాఠశాల సిబ్బంది తీసుకోవాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ చిట్టెమ్మ గోపాల్,పాఠశాల ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయులు రాజేశ్వర్‌రెడ్డి,పంచాయతీ కార్యదర్శి,వార్డు సభ్యులు, ఉపాధ్యాయులు,విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# ఆల్ ఇండియా సివిల్ సర్వీసెస్

# క్రీడలకు జిల్లా స్థాయి ట్రయల్స్

**గద్వాల సెప్టెంబర్ 03(ప్రజా జ్యోతి ప్రతినిధి):**






ఆల్ ఇండియా సివిల్ సర్వీసెస్ స్పోర్ట్స్ కాంపిటీషన్స్ 202627కు సంబంధించి జిల్లా స్థాయి ట్రయల్స్‌ను జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు గురువారం గద్వాల ఇండోర్ స్టేడియంలో నిర్వహించారు.జిల్లా యువజన,క్రీడల అధికారి రామలింగేశ్వర్ గౌడ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ ట్రయల్స్‌లో జిల్లాలోని వివిధ ప్రభుత్వ శాఖలకు చెందిన ఆసక్తిగల రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు పాల్గొని తమ క్రీడా ప్రతిభను ప్రదర్శించారు.అథ్లెటిక్స్,బాస్కెట్‌బాల్,షటిల్ బ్యాడ్మింటన్,క్రికెట్,చెస్, క్యారమ్స్,ఫుట్‌బాల్,హాకీ,కబడ్డీ,లాన్ టెన్నిస్,పవర్ లిఫ్టింగ్,స్విమ్మింగ్,టేబుల్ టెన్నిస్, వాలీబాల్,వెయిట్ లిఫ్టింగ్,రెజ్లింగ్,బెస్ట్ ఫిజిక్,యోగా,ఖో-ఖో తదితర క్రీడాంశాల్లో క్రీడాకారులకు ట్రయల్స్ నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా యువజన,క్రీడల అధికారి రామలింగేశ్వర్ గౌడ్ మాట్లాడుతూ,జిల్లా స్థాయి ట్రయల్స్‌లో ప్రతిభ కనబరిచి ఎంపికైన క్రీడాకారులను రాష్ట్ర స్థాయి పోటీలకు పంపనున్నట్లు తెలిపారు.ప్రభుత్వ ఉద్యోగుల్లో దాగి ఉన్న క్రీడా ప్రతిభను వెలికితీసి,రాష్ట్ర,జాతీయ స్థాయిలో తమ ప్రతిభను ప్రదర్శించే అవకాశాలు కల్పించడమే ట్రయల్స్ ప్రధాన ఉద్దేశమని పేర్కొన్నారు.కార్యక్రమంలో పీఈటీలు,క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

# దయానంద విద్యా మందిర్‌లో ఘనంగా కృష్ణాష్టమి వేడుకలు

**గద్వాల సెప్టెంబర్ 03 (ప్రజా జ్యోతి ప్రతినిధి):**

గద్వాల పట్టణంలోని దయానంద విద్యా మందిర్ పాఠశాలలో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా విద్యార్థులు శ్రీకృష్ణుడు,గోపికల వేషధారణలో అలరించడంతో పాఠశాల ఆవరణ సందడిగా మారింది.విద్యార్థులకు శ్రీకృష్ణ జన్మాష్టమి విశిష్టతతో పాటు శ్రీకృష్ణుడి జీవితం,ధర్మబోధనలు,సత్ప్రవర్తన,నైతిక విలువలను సులభంగా అర్థమయ్యేలా వివరించారు.ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ హరినాథ్ రెడ్డి మాట్లాడుతూ, తెలంగాణ సంస్కృతి,సంప్రదాయాల్లో కృష్ణాష్టమికి ప్రత్యేక ప్రాధాన్యత ఉందన్నారు. ప్రతి ఏడాది పాఠశాలలో కృష్ణాష్టమి వేడుకలను నిర్వహిస్తూ విద్యార్థులకు మనసంస్కృతి, సంప్రదాయాలపై అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు.చిన్నారుల శ్రీకృష్ణ, గోపికల వేషధారణలు,సాంస్కృతిక కార్యక్రమాలు వేడుకలకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.కార్యక్రమంలో విద్యార్థులు,విద్యార్థినులు,పాఠశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.






# పెద్ద చింతరేవులలో 4,5 తేదీల్లో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు

## - పీఠాధిపతుల సమక్షంలో ప్రత్యేక పూజలు,హోమాలు

**గద్వాల సెప్టెంబర్ 03 (ప్రజా జ్యోతి ప్రతినిధి):**

జోగులాంబ గద్వాల జిల్లా ధరూర్ మండల పరిధిలోని పెద్ద చింతరేవుల గ్రామంలో 15వ,శతాబ్దం నాటి శ్రీ ఆంజనేయ స్వామి దేవాలయ ప్రాంగణంలోని అన్నప్రసాద ట్రస్ట్ సత్రంలో ఈ నెల 4,5 తేదీల్లో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించనున్నట్లు ఆలయ ప్రధాన అర్చకులు ఆధ్యా చక్రవర్తి కేశవాచార్యులు తెలిపారు.ఉడిపి పాలిమర్ మఠం పీఠాధిపతుల సమక్షంలో ఉడిపి వేద పండితులచే శాస్త్రోక్తంగా ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.ఈ నెల 4న శ్రావణ శుక్రవారం అష్టమి సందర్భంగా ఉదయం 8 గంటలకు





ఉడిపి పాలిమర్ మఠం పీఠాధిపతులు శ్రీ 1008 శ్రీ విద్యాధీశతీర్థ శ్రీపాదులు,శ్రీ 1008 విద్యారాజేశ్వర తీర్థ శ్రీపాదులు మూలరాముల వారికి ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు.అనంతరం సామూహిక విష్ణు సహస్రనామావళి పారాయణంతో తులసి పూజ,గోపూజ,పవమాన హోమం,నవగ్రహ హోమం,శ్రీ ఆంజనేయ స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు.పీఠాధిపతులచే భాగవత,రామాయణ ప్రవచనాలు,అనంతరం తీర్థప్రసాద గోష్టి ఉంటుందని తెలిపారు.సాయంత్రం సామూహికంగా విష్ణు సహస్రనామావళితో తులసి పూజ నిర్వహించనున్నట్లు చెప్పారు.శుక్రవారం అర్ధరాత్రి 12.15 గంటలకు శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలను వేదోక్తంగా నిర్వహించనున్నట్లు తెలిపారు.శనివారం బ్రహ్మముహూర్తంలో శ్రీ ఆంజనేయ స్వామివారికి ప్రత్యేక పూజలు,అభిషేకాలు నిర్వహించనున్నారు.అనంతరం ఉట్లు ఉత్సవం,శ్రీకృష్ణ లీలా ఉత్సవం,సాయంత్రం సుదర్శన చక్ర మండల పూజతో పాటు ఇతర ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు.ఈ పూజా కార్యక్రమాల్లో పాల్గొనే భక్తులందరికీ పెద్ద చింతరేవుల అన్నప్రసాద ట్రస్ట్ ఆధ్వర్యంలో అన్నప్రసాద వితరణ ఉంటుందని కేశవాచార్యులు తెలిపారు.భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివార్ల కృపాకటాక్షాలు పొందాలని కోరారు.పూజా కార్యక్రమాల్లో పాల్గొనదలచిన భక్తులు 9959251123,9949789241,9440807109, 9440770020 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

# మంత్రి కొండ సురేఖ ను కాంగ్రెస్ పార్టీ నుండి బర్తరఫ్ చేయడం సరికాదు డాక్టర్.ప్రేమ్ కుమార్

**గద్వాల (ప్రజా జ్యోతి) సెప్టెంబర్ 03:**

తెలంగాణ మంత్రి కొండ సురేఖను కాంగ్రెస్ పార్టీ బర్తరఫ్ చెయ్యడం సరికాదని సామాజిక విప్లవ కారుడు డాక్టర్ ప్రేమ్ కుమార్ అన్నారు. కాంగ్రెస్ పార్టీలో ఉంటూ నిరంతరం ప్రజల మధ్యలో ఉంటూ వారి సంక్షేమం కోసమే పాటు పడే మంత్రి కొండ సురేఖను బర్తరఫ్ చెయ్యడం ఏమాత్రం సమంజసం కాదని కాంగ్రెస్ పార్టీలోఎందరో ఎమ్మెల్యే లు,ఎంపీ లు మంత్రులు అనుచిత వాక్యాలు చేసిన వారిపై చర్య తీసుకోలేదు అలాంటిది మంత్రి కూతురు చేసిన వాక్యాలకు మంత్రి ని బలిచెయ్యడం సరి కాదని యావత్ తెలంగాణ ప్రజానికం కొండ సురేఖకు అండ గా ఉంటుందని సామాజిక విప్లవ కారుడు డాక్టర్ ప్రేమ్ కుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.



# మాగనూరులో అట్టహాసంగా మండల స్థాయి SGF క్రీడా పోటీలు

## జిల్లా స్థాయికి క్రీడాకారుల ఎంపిక..

## కోకో కబడ్డీ పోటీల్లో అదరగొట్టిన విద్యార్థులు..

**మాగనూరు, సెప్టెంబర్ 3(ప్రజా జ్యోతి)**

మాగనూరు మండల స్థాయి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ (ఎస్+జీ) క్రీడా పోటీలు గురువారం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మైదానంలో అత్యంత అట్టహాసంగా జరిగాయి. ఈ పోటీలలో మండలంలోని వివిధ ప్రభుత్వ, ప్రైవేటు, మరియు కేజీబీవీ (ఖ+దీఎ) పాఠశాలలకు చెందిన విద్యార్థినీ విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని తమ ప్రతిభను చాటుకున్నారు. కబడ్డీ, ఖో–ఖో, వాలీబాల్ తదితర క్రీడాంశాలలో విద్యార్థులు ఎంతో ఉత్సాహంగా తలపడ్డారు. అలగే వివిధ క్రీడల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను మండల స్థాయి జట్లకు ఎంపిక చేశారు. ఇక్కడ ఎంపికైన క్రీడాకారులు ఈ నెలలోనే జరగబోయే జిల్లా స్థాయి ఎస్+జీ క్రీడా పోటీల్లో మాగనూరు మండలం తరఫున ప్రాతినిధ్యం వహించనున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా సర్పంచ్ తనయుడు దండు సత్యప్ప గారు, మాజీ సర్పంచ్ ఆనంద్ గారు, శివరాం రెడ్డి గారు హాజరై క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని పిలుపునిచ్చారు. మండల స్థాయిలోనే కాకుండా జిల్లా, రాష్ట్ర స్థాయి పోటీల్లో కూడా అత్యుత్తమ ప్రతిభ కనబరిచి విజయాలు సాధించాలని, మాగనూరు మండలానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో హెచ్.ఎం బాబు రెడ్డి, ఫిజికల్ డైరెక్టర్ శర్మ, ఉపాధ్యాయులు రేణుక, శ్రీవాణి, మీనా కుమారి, ఇతర ఉపాధ్యాయ బృందం ఆధ్వర్యంలో ముగిశాయి..



మొదటిపేజీ తరువాయి

# ఢిల్లీ వేదికగా తెలంగాణ కాంగ్రెస్ కీలక మంతనాలు!

## - ఖర్గేతో సీఎం రేవంత్‌రెడ్డి,మంత్రులు,సంపత్‌కుమార్ భేటీ

**గద్వాల,సెప్టెంబర్ 3(ప్రజా జ్యోతి ప్రతినిధి):**

తెలంగాణ కాంగ్రెస్‌లో కీలక పరిణామాలకు ఢిల్లీ వేదికైంది.ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేతో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి,ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క,అలంపూర్ మాజీ ఎమ్మెల్యే,ఏఐసీసీ కార్యదర్శి డాక్టర్ ఎస్.ఏ.సంపత్‌కుమార్,నాగర్‌కర్నూల్ ఎంపీ మల్లు రవి,మంత్రి శ్రీధర్‌బాబు,రాజ్యసభ సభ్యుడు అనిల్‌కుమార్ యాదవ్ తదితరులు సమావేశమయ్యారు.ఈ భేటీలో తెలంగాణలోని తాజా రాజకీయ పరిస్థితులు,కాంగ్రెస్ పార్టీ బలోపేతం,నాయకుల మధ్య సమన్వయం,పార్టీ అంతర్గత వ్యవహారాలపై విస్తృతంగా చర్చించినట్లు సమాచారం. పార్టీ క్రమశిక్షణను కాపాడుతూ నాయకులు,కార్యకర్తలను సమన్వయంతో ముందుకు తీసుకెళ్లే అంశంపై అగ్రనాయకత్వం దృష్టి సారించినట్లు తెలుస్తోంది.ముఖ్యంగా మంత్రివర్గ విస్తరణ,రానున్న ఎమ్మెల్సీ ఎన్నికలు,పార్టీ కీలక పదవుల భర్తీ,వర్కింగ్ ప్రెసిడెంట్ పదవుల అంశం భేటీలో ప్రస్తావనకు వచ్చినట్లు సమాచారం.రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేసేందుకు చేపట్టాల్సిన కార్యాచరణపై కూడా నేతలు చర్చించినట్లు తెలుస్తోంది.

### సంపత్‌కుమార్ భేటీకి ప్రాధాన్యత

అలంపూర్ మాజీ ఎమ్మెల్యే,ఏఐసీసీ కార్యదర్శి డాక్టర్ ఎస్.ఏ.సంపత్‌కుమార్ ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేతో సమావేశం కావడం రాజకీయ వర్గాల్లో ఆసక్తి రేకెత్తిస్తోంది.తెలంగాణలో పార్టీ పరిస్థితులు,క్షేత్రస్థాయిలో నెలకొన్న పరిస్థితులు,పార్టీ బలోపేతానికి తీసుకోవాల్సిన చర్యలపై ఆయన అగ్రనాయకత్వంతో చర్చించినట్లు సమాచారం.దీంతో సంపత్‌కుమార్ భేటీకి రాజకీయంగా ప్రాధాన్యత ఏర్పడింది.

# సంఘం బండ సాగునీటి కాలువలలో పూడికతీత పనులను చేపట్టిన మంత్రి సోదరుడు వాకిటి శేషగిరి

**నర్వ సెప్టెంబరు 3 ప్రజా జ్యోతి**

నారాయణపేట జిల్లా మక్తల్ నియోజకవర్గం లోని నర్వ మండలంలో నీ. ఆయా గ్రామాలకు సాగునీటిని అందిస్తున్న సంఘం బండ బూత్పూర్ రిజర్వాయర్ సాగునీటి కాలువలకు ఎన్నో ఏళ్లుగా పేరుకపోయిన పూడికతీత పనులను ఆయన ప్రారంభించారు, ఆయా గ్రామాల రైతుల కోరిక మేరకు తెలంగాణ మంత్రి వాకిటి శ్రీహరి, ఆదేశానుసారంగా ఆయన సోదరుడు వాకిటి శేషగిరి సాగునీటి కాలంలో వెంబడి తిరుగుతూ పరిశీలించారు, అనంతరం పూడికతీత పనులను జెసిబి హిటాచిలతో కెనాల లో కొన్నేళ్లుగా కంప చెట్లు పిచ్చి మొక్కలతో పాటు మట్టితో పేరుకుపోయిన కూడికతీత పనులను ఆయన దగ్గరుండి ప్రారంభించారు, ఈ సందర్భంగా నర్వ మండలంలోని రాజు పల్లె, రాయికోడు, నర్వ, ఉండే కోడు, గ్రామాల శివారులోని సంగం బండ సాగునీటి కాలువలను ఆయన పరిశీలించారు, గ్రామాల రైతులు ఆయనతో మాట్లాడుతూ కాలువలలో పిచ్చి ముక్కులతో పాటు మట్టి కూరుకుపోవడంతో నీళ్లు ముందుకు వెళ్లడం లేదని తెలుపడం జరిగింది స్పందించిన ఆయన వెంటనే హిటాచీలను తెప్పించే ఎక్కడైతే కాలువలకు ఉన్నటువంటి అడ్డంకులను తొలగించాలని పనులను ప్రారంభించారు, ఆయన వెంట నర్వ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బిసం చెన్నయ్య సాగర్ , కాంగ్రెస్ నాయకులు ఆ గ్రామాల రైతులు తదితరులు పాల్గొన్నారు





# నర్వ లో రేపు బిఆర్ఎస్ ఆధ్వర్యంలో నిరసన ధర్నా కార్యక్రమం

**నర్వ సెప్టెంబర్ 3 ప్రజా జ్యోతి**

నారాయణపేట జిల్లా నర్వ మండల కేంద్రంలో ఈనెల ఐదున టిఆర్ఎస్ మండల పార్టీ ఆధ్వర్యంలో నిరసన ధర్నా కార్యక్రమం ఉంటుందని బిఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షులు మహేశ్వర్ రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు, ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం వెయ్యి రోజుల పాలనలో వారు చేసిన అభివృద్ధి కార్యక్రమాలు సంక్షేమ పథకాల, 6 గ్యారంటీ ల వైఫల్యాలను ఎండగడుతూ నిరసన కార్యక్రమాన్ని చేపట్టడం జరిగిందన్నారు, ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు మండలంలోని ఆయా గ్రామాల బిఆర్ఎస్ నాయకులు కార్యకర్తలు ప్రజలు విధిగా పాల్గొనే విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు



# వెన్నచేడ్ విద్యకు కొత్త వెలుగు పాఠశాలల్లో ఆధునిక వసతుల కల్పన.. కంప్యూటర్ ల్యాబ్, ఫిల్టర్ వాటర్ ప్లాంట్ ప్రారంభం

(ప్రజాజ్యోతి):

విద్యార్థుల సౌకర్యాలు, విద్యా ప్రమాణాల మెరుగుదలకు ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని గ్రామ సర్పంచ్ గుర్రాల నవనీత చెన్నయ్య అన్నారు. గండీడ్ మండలంలోని వెన్నచేడ్ గ్రామ ప్రాథమిక పాఠశాలలో నూతనంగా ఏర్పాటు చేసిన కంప్యూటర్ ల్యాబ్, ఫిల్టర్ వాటర్ ప్లాంట్ను గురువారం ముఖ్య అతిథులుగా హాజరైన సర్పంచ్ గుర్రాల నవనీత చెన్నయ్య, కాంగ్రెస్ గండీడ్ మండల పార్టీ అధ్యక్షులు అనంత లక్ష్మారెడ్డి, ఎంఈఓ జనార్ధన్ ప్రారంభించారు.అనంతరం వెన్నచేడ్గ్రాూ బాలికల ఉన్నత పాఠశాలలో ప్రభుత్వం అందించిన టైలు, బెల్ట్లను విద్యార్థినులకు పంపిణీ చేశారు.గ్రాూ బాలుర ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు షూలు, టైలు, బెల్ట్లను అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ గుర్రాల నవనీత చెన్నయ్య మాట్లాడుతూ.. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వం పాఠశాలల్లో మౌలిక వసతులతో పాటు అవసరమైన సౌకర్యాలను కల్పిస్తోందన్నారు. విద్యార్థులు ప్రభుత్వం అందిస్తున్న సదుపాయాలను సద్వినియోగం చేసుకొని క్రమశిక్షణ, పట్టుదలతో చదివి ఉన్నత శిఖరాలకు ఎదగాలని ఆకాంక్షించారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకొని విద్యలో రాణించాలని సూచించారు.పాఠశాలల్లో నూతన సౌకర్యాలు అందుబాటులోకి రావడం పట్ల విద్యార్థులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేశారు. కంప్యూటర్ ల్యాబ్ ద్వారా విద్యార్థులకు సాంకేతిక పరిజ్ఞానంపై అవగాహన పెరగడంతో పాటు, ఫిల్టర్ వాటర్ ప్లాంట్తో స్వచ్ఛమైన తాగునీటి సౌకర్యం అందుబాటులోకి వచ్చిందని తెలిపారు. ఈ కార్యక్రమంలోగ్రాూ హెచ్ఎం రవిబాబు, పుల్లారెడ్డి, రామ్రెడ్డి, ఉప సర్పంచ్ రవికాంత్ రెడ్డి, పిఏసిఎస్ డైరెక్టర్ పుష్పలత గోపాల్, పులిందర్ రెడ్డి, నర్సింహులు, నందు, అన్ని పాఠశాలల హెచ్ఎంలు, ఉపాధ్యాయులు, గ్రామ పెద్దలు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



# ఎంపీ నిధులతో గండీడ్ మండలానికి జలవరం

## వెన్నాచేడ్లో 4 బోర్లు.. పగిడ్యాలలో బోర్వెల్ విజయవంతం

గండీడ్, సెప్టెంబర్ 3 (ప్రజాజ్యోతి):

చేవెళ్ల పార్లమెంట్ సభ్యులు కొండా విశ్వేశ్వర్ రెడ్డి ఎంపీ లాడ్స్ నిధులతో గండీడ్ మండలంలోని గ్రామాలకు తాగునీటి సౌకర్యం కల్పించేందుకు చేపడుతున్న బోర్వెల్ పనులు సత్ఫలితాలు ఇస్తున్నాయి. వెన్నాచేడ్ గ్రామానికి మంజూరైన నాలుగు బోర్లలో భాగంగా మొదటి బోరు తవ్వకం విజయవంతం కాగా, పగిడ్యాల గ్రామంలోనూ ఎంపీ నిధులతో చేపట్టిన బోర్వెల్లో సమృద్ధిగా నీరు లభించింది.

### వెన్నాచేడ్లో జలధార..

వెన్నాచేడ్ గ్రామంలోని ఎస్సీ కాలనీలో శ్రీ రేణుక ఎల్లమ్మ తల్లి దేవాలయం వద్ద గురువారం మొదటి బోర్వెల్ తవ్వకం చేపట్టారు. బీజేపీ రాష్ట్ర నాయకులు డా. వెన్న ఈశ్వరప్ప ప్రత్యేక చొరవ, సమక్షంలో జరిగిన ఈ పనుల్లో సుమారు రెండున్నర ఇంచుల మేర నీరు లభించడంతో కాలనీవాసులు ఆనందం వ్యక్తం చేశారు. ఈ బోర్వెల్తో ఎస్సీ కాలనీలో తాగునీటి ఇబ్బందులు గణనీయంగా తగ్గనున్నాయని స్థానికులు తెలిపారు.

### పగిడ్యాలలోనూ నీటి లభ్యత..

గండీడ్ మండలంలోని పగిడ్యాల గ్రామానికి ఎంపీ లాడ్స్ నిధులతో మంజూరైన బోర్వెల్ తవ్వకం కూడా విజయవంతమైంది. బోర్వెల్లో నీరు పడటంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. గ్రామంలో నీటి ఎద్దడి సమస్యకు ఈ బోర్వెల్ ఉపశమనం కలిగిస్తుందని స్థానికులు ఆశాభావం వ్యక్తం చేశారు. గ్రామాల తాగునీటి అవసరాలను గుర్తించి బోర్లకు నిధులు మంజూరు చేసిన ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డికి, పనులను దగ్గరుండి పర్యవేక్షిస్తున్న డా. వెన్న ఈశ్వరప్పకు గ్రామస్తులు, కాలనీవాసులు కృతజ్ఞతలు తెలిపారు. వెన్నాచేడ్లో మిగిలిన మూడు బోర్ల తవ్వకం పనులను కూడా త్వరలో పూర్తి చేస్తామని బీజేపీ నాయకులు తెలిపారు.ఈ కార్యక్రమాల్లో వెన్నాచేడ్ సర్పంచ్ గుర్రాల నవనీత చెన్నయ్య, ఉప సర్పంచ్ రవికాంత్ రెడ్డి, గ్రామ కార్యదర్శి చెన్నకేశవులు, గ్రామ పెద్దలు శివ మల్లప్ప, జి. రాములు, నరేందర్ రెడ్డి, నారాయణ రెడ్డి, రామ్ రెడ్డి, మండల ప్రధాన కార్యదర్శి మల్కయ్య, మాజీ ఓబీసీ మోర్చా మండల అధ్యక్షులు బాలయ్య, మండల ఎస్సీ మోర్చా అధ్యక్షులు రాములు, మాజీ ఎంపీటీసీ రేణుక దశరథ్, వార్డు సభ్యులు ఆంజనేయులు, నరేష్, శంకర్ ప్రభు నాయక్ కృష్ణారెడ్డి  సంగమేశ్వర్ తదితర బీజేపీ నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.





# వెయ్యి రోజుల పాలనలో ఇచ్చిన హామీలన్నీ అమలు చేస్తున్నాం

## - కాంగ్రెస్ పాలనపై ప్రజల్లో సంతృప్తి ఉంది: - మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ ఒబేదుల్లా కొత్వాల్

**మహబూబ్‌నగర్, సెప్టెంబర్ 3 ( ప్రజా జ్యోతి బ్యూరో ):**

సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తూ రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్తోందని రాష్ట్ర మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ ఒబేదుల్లా కొత్వాల్ అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వెయ్యి రోజుల పాలన పూర్తి చేసుకున్న సందర్భంగా గురువారం మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో డీసీసీ అధ్యక్షుడు సంజీవ్ ముదిరాజ్‌తో కలిసి ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. వెయ్యి రోజుల కాంగ్రెస్ పాలనపై తమకు ఎంతో గర్వంగా ఉందని కొత్వాల్ పేర్కొన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలతో పాటు ఇవ్వని హామీలను సైతం ప్రభుత్వం అమలు చేస్తోందని, దేశంలోనే ఆదర్శవంతమైన పాలన అందిస్తోందని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ విజయాలను చూసి ఓర్వలేకే బీఆర్ఎస్ ఆందోళనలకు దిగుతోందని విమర్శించారు. మహబూబ్‌నగర్ పట్టణంలో మాజీ మంత్రి ఆధ్వర్యంలో నిర్వహించిన ఫ్లెక్సీ ర్యాలీపై కొత్వాల్ వ్యంగ్యాస్త్రాలు సంధించారు. ఆ ర్యాలీని చూసి ప్రజలు నవ్వుకుంటున్నారని ఎద్దేవా చేశారు. గత పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో సాగునీటి సమస్యను పట్టించుకోకుండా ప్రాంతాన్ని ఎడారిగా మార్చారని ఆరోపించారు. తాగునీరు, సాగునీరు, వ్యవసాయ రంగాలను నిర్వీర్యం చేశారని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం వ్యవసాయ రంగానికి సుమారు రూ. 1.72 లక్షల కోట్లతో అండగా నిలిచిందని కొత్వాల్ తెలిపారు. సుమారు 25 లక్షల మంది రైతులకు రూ. 20,617 కోట్లను నేరుగా వారి ఖాతాల్లో జమ చేసి రుణమాఫీ చేసినట్లు చెప్పారు. పంటలకు గిట్టుబాటు ధరతో పాటు బోనస్ అందిస్తూ రైతుల్లో ఆత్మవిశ్వాసాన్ని పెంచుతున్నామని పేర్కొన్నారు. మహబూబ్‌నగర్ జిల్లాలోనూ సాగునీటి ప్రాజెక్టులకు ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందని తెలిపారు. కొడంగల్‌నారాయణపేట ఎత్తిపోతల పథకం, కొల్లాపూర్ ప్రాజెక్టుల పనులను వేగవంతం చేసి నిధులు విడుదల చేసినట్లు వెల్లడించారు. గతంలో మూతపడిన సీడ్ డెవలప్‌మెంట్




కార్పొరేషన్, ఆగ్రో ఇండస్ట్రీస్ వంటి సంస్థలను తిరిగి బలోపేతం చేయడం ద్వారా ప్రభుత్వం వ్యవసాయ రంగానికి కొత్త ఊపునిస్తోందన్నారు. ఈ సమావేశంలో టీపీసీసీ అధికార ప్రతినిధి జహీర్ అఖ్తర్, డీసీసీ ప్రధాన కార్యదర్శి చంద్రకుమార్ గౌడ్, మీడియా సెల్ కన్వీనర్ సీజే బెనహర్ తదితరులు పాల్గొన్నారు.

# పెద్దమారూర్‌లో చిన్నారుల నృత్యాలతో కళకళలాడిన పాఠశాల

**చిన్నంబావి, సెప్టెంబర్ 3 (ప్రజాజ్యోతి)**

చిన్నంబావి మండలంలోని పెద్దమారూర్ గ్రామ ప్రాథమిక పాఠశాలలో గురువారం ముందస్తు శ్రీకృష్ణాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఉపాధ్యాయుల పర్యవేక్షణలో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని వేడుకలకు ప్రత్యేక శోభను తీసుకొచ్చారు.రాధాకృష్ణుల వేషధారణలో చిన్నారులు పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు అలివేల ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకల్లో చిన్నారులు రాధాకృష్ణుల వేషధారణలో ముస్తాబయ్యారు. రాధాకృష్ణుల పాటలకు అనుగుణంగా నృత్యాలు, అభినయాలతో ఆకట్టుకున్నారు. చిన్నారుల వేషధారణ, సాంస్కృతిక ప్రదర్శనలు అందరినీ అలరించాయి.చదువుతో పాటు ప్రతిభకు ప్రోత్సాహం ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయురాలు అలివేల మాట్లాడుతూ.. చదువుతో పాటు ఆటలు, సాంస్కృతిక కార్యక్రమాలకు ప్రాధాన్యతనిస్తూ విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభ, నైపుణ్యాలను వెలికితీస్తున్నామని తెలిపారు. ఇటువంటి కార్యక్రమాలు విద్యార్థుల్లో సృజనాత్మకత, ఆత్మవిశ్వాసాన్ని పెంపొందిస్తాయని పేర్కొన్నారు.రాధాకృష్ణుల వేషధారణలో చిన్నారుల సందడితో.. పెద్దమారూర్ పాఠశాల ప్రాంగణం కృష్ణమయం అయింది.





# విద్యార్థుల భవితకు వెలుగు.. విద్యనే వికాస సాధనం : కవి జొన్నవిత్తుల రామలింగేశ్వర రావు

## - విద్యార్థులు విద్యను గౌరవించాలని పిలుపు

## - జేపీఎన్ కళాశాలలో ఉత్తమ ఉపాధ్యాయుల సన్మానం

**మహబూబ్‌నగర్, సెప్టెంబర్ 3 ( ప్రజా జ్యోతి బ్యూరో ):**







విద్యార్థుల భవితకు వెలుగు.. విద్యనే వికాస సాధనం అని కవి జొన్నవిత్తుల రామలింగేశ్వర రావు అన్నారు . గురు వారం మహబూబ్‌నగర్ జిల్లా రూరల్ మండల పరిధిలోని జయప్రకాష్ నారాయణ ఇంజనీరింగ్ కళాశాలలో  విద్యార్థులతో ముఖాముఖి కార్యక్రమం, ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మాన కార్యక్రమం జేపీఎన్‌సీ కళాశాల చైర్మన్ కె.ఎస్. రవికుమార్ అధ్యక్షతన ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ప్రముఖ సినీ గీత రచయిత, కవి జొన్నవిత్తుల రామలింగేశ్వర రావు హాజరై విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, విజ్ఞానాన్ని, వికాసాన్ని భవిష్యత్ తరాలకు అందించాలంటే విద్యార్థులు విద్యను ఏకాగ్రతతో నేర్చుకోవాలని పిలుపునిచ్చారు. తల్లిదండ్రులు ఎన్నో కష్టనష్టాలకు ఓర్చి పిల్లలను చదివిస్తున్నారని, భవిష్యత్తులో వారు సంస్కారవంతులుగా, క్రమశిక్షణతో ఎదగాలనే ఉద్దేశంతోనే ఈ ప్రయత్నం చేస్తున్నారని పేర్కొన్నారు. చదువు ఒంటబట్టాలంటే ముందుగా శ్రద్ధగా వినడం అలవాటు చేసుకోవాలని సూచించారు. ఈ కళాశాలలో చదివిన విద్యార్థులు నేడు ఉన్నత స్థానాల్లో ఉన్నారని, పలువురు దేశ, విదేశాల్లోని కంపెనీల్లో ఉద్యోగాలు సాధించారని కొనియాడారు. అధ్యాపకులు బోధించే విధానాన్ని విద్యార్థులు శ్రద్ధగా ఆకళింపు చేసుకోవాలని సూచించారు.జేపీఎన్ కళాశాల చైర్మన్ కె.ఎస్. రవికుమార్‌తో తనకు ఎన్నో ఏళ్లుగా పరిచయం ఉందని, గత 30 సంవత్సరాలుగా ఎన్నో ప్రయాసలకోర్చి ఈ కళాశాలను అత్యున్నత స్థాయికి తీసుకువచ్చారని జొన్నవిత్తుల కొనియాడారు. ఈ సందర్భంగా ఆయన పలు కవితలు, గేయాలు వినిపించగా, అక్షరాలతో సరస్వతీ దేవి రూపాన్ని వర్ణించిన తీరు అందరినీ ఆకట్టుకుంది.అనంతరం కళాశాల చైర్మన్ కె.ఎస్. రవికుమార్ మాట్లాడుతూ, కళాశాల స్థాపించి 30 సంవత్సరాలు పూర్తయిందని, జేపీఎన్‌సీ కళాశాల అభివృద్ధికి దివంగత మాజీ ఎంపీ జైపాల్ రెడ్డి ఎనలేని సహాయ సహకారాలు అందించారని గుర్తు చేసుకున్నారు. తన ఇష్టదైవం సరస్వతీ దేవి ఆశీర్వాదంతోనే ఈ 30 ఏళ్ల ప్రస్థానం సాధ్యమైందని పేర్కొన్నారు. జయప్రకాష్ నారాయణ ఇంజనీరింగ్ కళాశాల రాష్ట్రవ్యాప్తంగా మంచి పేరు ప్రఖ్యాతలు గడించిందని, ఈ విద్యా సంవత్సరంలో 520 అడ్మిషన్లు జరిగి ఉమ్మడి జిల్లాలోనే అగ్రగామిగా నిలిచిందని తెలిపారు. ఈ కళాశాల నుంచి 569 మంది విద్యార్థులు రాష్ట్రంలోనే కాకుండా విదేశాల్లోనూ ఉద్యోగాలు సాధించి ఉన్నత స్థాయికి ఎదిగారని, వారి కుటుంబ సభ్యులు సుఖసంతోషాలతో జీవిస్తున్నారని ఆనందం వ్యక్తం చేశారు. విద్యార్థులు క్రమశిక్షణతో మెలగాలని పలు సూచనలు, సలహాలు అందించారు. ఈ కార్యక్రమంలో కవి, గేయ రచయిత జొన్నవిత్తుల రామలింగేశ్వర రావును శాలువాలతో ఘనంగా సత్కరించారు. అలాగే పలువురు ఉత్తమ ఉపాధ్యాయులను, విద్యార్థులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో సంగీత నాటక అకాడమీ మాజీ చైర్మన్ శివకుమార్, కళాశాల ప్రిన్సిపల్, వివిధ ఇంజనీరింగ్ విభాగాధిపతులు, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.



# పాత బస్టాండ్‌ను అభివృద్ధి చేయరా ఎమ్మెల్యే గారూ?

## - జిల్లా అభివృద్ధికి వేల కోట్లు అన్నారు.. రూ.2 కోట్లతో ఆధునీకరణ చేయలేరా?

## - నెల రోజుల్లో పనులు చేపట్టకపోతే ప్రజా ఆందోళన: అఖిలపక్ష ఐక్యవేదిక అధ్యక్షుడు డా. సతీష్ యాదవ్

**వనపర్తి, డిసెంబరు 3 (ప్రజాజ్యోతి):**

నాలుగైదు జిల్లాలకు రాకపోకలకు కీలకంగా ఉన్న పాత బస్టాండ్ అభివృద్ధికి నోచుకోవడం లేదంటూ అఖిలపక్ష ఐక్యవేదిక, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ జేఏసీ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం పాత బస్టాండ్‌ను పరిశీలించిన వారు ప్రయాణికుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అఖిలపక్ష ఐక్యవేదిక అధ్యక్షుడు డా. సతీష్ యాదవ్ మాట్లాడుతూ.. నియోజకవర్గానికి వేల కోట్ల నిధులు తెచ్చామని చెబుతున్న నాయకులు రూ.2 కోట్లతో పాత బస్టాండ్‌ను ఆధునీకరించలేరా? అని ప్రశ్నించారు. తాగునీరు, మూత్రశాలలు, నిలువ నీడ వంటి కనీస సౌకర్యాలు లేక ప్రయాణికులు దుమ్ము, ధూళిలో, ఎండా వానలో అవస్థలు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అక్కడ అధికారులు ఎవరూ లేక ప్రైవేటు వాహనాలకు పార్కింగ్ సౌకర్యం చేశారు. రాజకీయాలు, విమర్శలు, ఆరోపణలు పక్కనపెట్టి ప్రజలకు అవసరమైన అభివృద్ధిపై దృష్టి పెట్టండి. ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయండని ప్రశ్నించారు. పాత బస్టాండ్‌ను వెంటనే ఆధునీకరించి మౌలిక వసతులు కల్పించాలని డిమాండ్ చేశారు. నెల రోజుల్లో పనులు ప్రారంభించకపోతే ప్రజా ఆందోళన చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో అఖిలపక్ష ఐక్యవేదిక




వేదిక అధ్యక్షులు డా“సతీష్ యాదవ్, డి.ఎస్.పి పార్టీ జిల్లా అధ్యక్షులు రామకృష్ణ మహారాజ్, ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీ జేఏసీ అధ్యక్షులు, కాంగ్రెస్ నాయకులు వెంకటేశ్వర్లు, టిడిపి నాయకులు కొత్త గొల్ల శంకర్, రాజనగరం రామస్వామి, మధు, ఎల్లయ్య, సూర్య ప్రకాష్, గంధం రవి, చందు యాదవ్, ఆంజనేయులు, శివకుమార్, శాంతయ్య, ఈ రవి, రమేష్, స్వామి తదితరులు పాల్గొన్నారు.

# చిన్నంబావి కేడీఆర్ గ్రామర్ స్కూల్‌లో ముందస్తు కృష్ణాష్టమి వేడుకలు

## -కృష్ణుడు, గోపికల వేషధారణలో చిన్నారుల కనువిందు.. ఉట్టి కొట్టి సంబరాలు

**చిన్నంబావి, సెప్టెంబర్ 3, (ప్రజాజ్యోతి)**

వనపర్తి జిల్లా చిన్నంబావి మండల కేంద్రంలోని కేడీఆర్ గ్రామర్ స్కూల్‌లో ముందస్తు కృష్ణాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ప్రిన్సిపాల్ రవీందర్‌నాథ్ రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన వేడుకల్లో చిన్నారులు ఉత్సాహంగా పాల్గొని సందడి చేశారు. ఈ సందర్భంగా అభిరామ్, యువన్, సాయి, అక్షయ్, రోహిత్, ధర్మేందర్, ప్రియాంక, జోషిత, హన్సిక, అమిక్య, లాస్య, శ్రీవల్లి తదితర చిన్నారులు కృష్ణుడు, గోపికల వేషధారణలో ముస్తాబై ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. సంయుక్త గోపిక వేషధారణలో అలరించగా.. చిన్నారుల సంప్రదాయ అలంకరణలు అందరినీ ఆకట్టుకున్నాయి. అనంతరం చిన్నారులు ఉట్టి కొట్టి ఉత్సాహంగా సంబరాలు చేసుకున్నారు. విద్యార్థుల కేరింతలు, సందడితో పాఠశాల ప్రాంగణం పండుగ వాతావరణాన్ని సంతరించుకుంది. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఇంద్ర, రజియా సుల్తానా, రాజేశ్వరి, పుష్పలత, సంఘమిత్ర, సింధుజ, యశోద, రేవతి, వనిత, అనుకలి రామచందర్, మోహన్, శివ, పీఈటీ భరత్, రాజు, విద్యార్థులు పాల్గొన్నారు.

